క్లుప్తంగా

వేరుశనగ పంట పరిశీలన



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఏఓ భారతి

నల్లచెరువు: మండల పరిధిలోని దేవరింటి పల్లిలో రైతులు డి మహేంద్రారెడ్డి, అమర్‌నాథ్ రెడ్డికి సంబంధించిన పొలాల్లో సాగు చేసిన వేరుశనగ పంటను సోమవారం ఏఓ భారతి పరిశీలించారు. చీడపీడలు, ఆకుమడత పురుగుల నివారణల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో మల్లిరెడ్డి, పద్మావతమ్మ, వీహెచ్ఏ భాస్కర్ నాయక్, పాల్గొన్నారు.

పీపీ యూనిట్ మెడికల్ ఆఫీసర్‌గా జగదీష్



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందిస్తున్న జగదీష్

ధర్మవరం అర్బన్: ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రిలో పీపీ యూనిట్ మెడికల్ ఆఫీసర్‌గా డాక్టర్ జగదీష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆసుపత్రి సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

కండక్టర్ మృతి



మధుసూదన్ రావ్ (ఫైల్)

కదిరి అర్బన్: కదిరి ఆర్టీసీ డిపో కండక్టర్ మధుసూదనరావ్ (58) సోమవారం మృతి చెందాడు. గత సోమవారం గుండె నొప్పితో అనంతపురం సవేరా ఆసుపత్రిలో చేరాడు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అంత్యక్రియలకు తక్షణ సాయం కింద రూ. 15 వేలు డీఎం మైనోద్దీన్ అందజేశారు. కదిరి డిపో ఉద్యోగులు సంతాపం వ్యక్తం చేశారు.

రూ 3.78 లక్షల ఆదాయం

అమడగూరు: ఓడీ చెరువు మండల స్టేషన్ పరిధిలో అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడిన వాహనాల్లో 15 వాహనాలకు సోమవారం వేలంపాట నిర్వహించారు. జీఎస్టీ ధరతో రూ. 3.78 లక్షలు ఆదాయం వచ్చినట్లు సీఐ రాజేంద్రనాథ్ యాదవ్, ఎస్ఐ గోపి పేర్కొన్నారు. కార్యక్రమంలో సెబ్ అధికారులు పాల్గొన్నారు.


ఐకేపీ వీఓ లీడర్లకు శిక్షణ

అమడగూరు: ఓడీ చెరువు మండలంలోని ఐకేపీ గ్రామైఖ్య సంఘాల లీడర్లకు సోమవారం స్థానిక ఐకేపీ కార్యాలయంలో శిక్షణ తరగతులను నిర్వహించారు. సంఘం నిర్వహణ, రుణాలు ఇప్పించడం, కంతులు చెల్లించడం, వడ్డీ వివరాలపై మూడు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు ఏపీఎం రమణప్ప పేర్కొన్నారు. అలాగే అమడగూరు మండలంలోని లక్ష్మీ వీఓ వార్షిక మహాసభను ఏపీఎం గోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఐకేపీ స్థాపన, పురోగతి, తదితర అంశాలను తెలియజేశారు.

నివాళి

తనకల్లు: వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యుడు జక్కల ఆదిశేషు తల్లి జక్కల అక్కమ్మ అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. మండల పరిధిలోని బొంతలపల్లిలో సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ సీపీ సిద్దారెడ్డి జక్కల అక్కమ్మ చిత్రపటానికి పూలమాలలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు. జెడ్పీటీసీ జక్కల జ్యోతి, జక్కల ఆదిశేషుతో పాటు ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. కదిరి మున్సిపల్ వైస్ చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ రామ్‌దేశాయ్, కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, నాయకులు శ్రీనివాసులనాయుడు,నాగభూషణరెడ్డి,నాగరాజు, నీలకంఠారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వికసించిన బ్రహ్మకమలం



ధర్మవరం రూరల్: మాలగుండ్లపల్లి గ్రామంలో సోమవారం బ్రహ్మ కమలం వికసించింది. మేకల నరసింహులు, వరలక్ష్మీల దంపతుల పెరటిలో నాటిన మొక్కకు పుష్పం వికసించడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తులు పుష్పాన్ని చూడటానికి ఎగబడ్డారు.

ఇద్దరి ఆత్మహత్యాయత్నం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కొత్తపేటకు చెందిన ముస్కిన్‌వలి సోమవారం రాత్రి రైల్వే ట్రాక్ సమీపంలో సూపర్‌వాజ్‌మోల్ తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. స్నేహితులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించారు. ముస్కిన్‌కు పెళ్లి కాలేదు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

- కొత్తపేటకు చెందిన మల్లిక సోమవారం రాత్రి ఇంటిలో గుర్తు తెలియని మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ సభ్యులు ఆమెను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు.

6 రోజుల్లో 312 సర్టిఫికెట్లు



పుట్లవాండ్లపల్లిలో సర్టిఫికెట్ మంజూరుకు బయోమెట్రిక్ వేయించుకుంటున్న వలంటీర్ గణేష్

వలంటీర్లకు వందనం

అమడగూరు: మండలంలోని ఏ పుట్లవాండ్లపల్లి గ్రామ వలంటీర్ గణేష్ ప్రభుత్వ పథకాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్తూ గ్రామంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాడు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వలంటీర్ గణేష్ తనకు కేటాయించిన 50 కుటుంబాలకు అవసరమైన సర్టిఫికెట్లను మంజూరు చేయించాడు. ఆరు రోజుల సర్వేలో భాగంగా ఏకంగా 312 వివిధ రకాల సర్టిఫికెట్ల మంజూరుకు కృషి చేయడంతో అధికారులు, గ్రామస్తులు గణేష్ సేవలను ప్రశంసిస్తున్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా కొత్త రేషన్ కార్డు మంజూరు, హౌస్ హోల్డ్ మ్యాపింగ్ స్ప్లిట్టింగ్, ఫ్యామిలీ మెంబర్, ఆధార్ అనుసంధానం, కుల, ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్లను మంజూరు చేయించాడు. ప్రజలకు ఎంతో మేలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తున్నట్లు వలంటీర్ పేర్కొన్నాడు.

మా వలంటీర్ సేవలు భేష్



మా కుటుంబాలకు కేటాయించిన గ్రామ వలంటీర్ సేవలు భేషుగ్గా ఉన్నాయి. ప్రభుత్వం ఏదైనా కొత్తగా పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించిందటే వెంటనే తెలియజేస్తాడు. పథకం అమల్లోకి రాగానే ఇంటి వద్దకు వచ్చి సంబంధిత జెరాక్స్ ప్రతులను తీసుకెళ్లి పనిచేయిస్తాడు. ఇలాంటి వలంటీర్ల ద్వారా ప్రభుత్వానికి మంచి పేరు వస్తుంది. ప్రభుత్వానికి చెడ్డ పేరు తేవాలనే విపక్షాలు ఏవేవో అపద్ధాలు మాట్లాడుతున్నారు. సచివాలయాలు, వలంటీర్ల ద్వారా అన్నీ ఇంటికే వచ్చి చేరుతున్నాయి.

– అనిత, ఏ పుట్లవాండ్లపల్లి, అమడగూరు మండలం

వలంటీర్ అంటే చంద్రబాబుకు వణుకు



కదిరి పట్టణంలోని 29వ వార్డులో గడప గడపకూ వెళ్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

కదిరి: 'ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్న ముఖ్య ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చారు. ఈ వ్యవస్థ ద్వారా ప్రజలు సంతోషంగా ఉన్నారు. అందుకే టీడీపీ అధినేత చంద్రబాబుకు వలంటీర్ పేరు వినబడగానే వణుకు పుడుతోంది' అని కదిరి ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఎమ్మెల్యే 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 29వ వార్డులో పర్యటించారు. గడప గడపకూ వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. చంద్రబాబు పాలనతో పోలిస్తే జగన్ పాలన వంద రెట్లు మేలని ప్రతి గడపలో అన్నారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. 2024లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 175కు మొత్తం స్థానాలు కై వసం చేసుకుంటుందని, చంద్రబాబుకు అవే చివరి ఎన్నికలని ఎమ్మెల్యే అన్నారు. అంతకు మునుపు సీనియర్ వైఎస్సార్‌సీపీ నేత రహిమాన్ తన స్వగృహంలో మీడియాతో మాట్లాడుతూ మళ్లీ జగనే రాష్ట్రానికి ముఖ్యమంత్రి అవుతారని, కదిరి ఎమ్మెల్యేగా కూడా మరోసారి డా.సిద్దారెడ్డినే చూస్తామని ధీమా వ్యక్తపరిచారు. 29వ వార్డు కౌన్సిలర్ షబ్బీర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పరికి నజీమున్నీసా, వైస్ చైర్మన్‌లు రాజశేఖర్‌రెడ్డి, కొమ్ము గంగాదేవి, మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నేడు 19వ వార్డులో..

'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం మంగళవారం (నేడు) పట్టణంలోని 19వ వార్డులో నిర్వహించనున్నట్లు ఆ వార్డు కౌన్సిలర్ ఎం.రాజశేఖరాచారి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి పాల్గొనే ఈ కార్యక్రమానికి మున్సిపల్ పాలకవర్గంతో పాటు అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు తప్పక హాజరు కావాలని కోరారు.

పవన్ కళ్యాణ్‌ను కఠినంగా శిక్షించాలి



ర్యాలీ చేస్తున్న వలంటీర్లు

గాండ్లపెంట: జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ తమపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు వలంటీర్లు నిరసన తెలిపారు. సోమవారం స్థానిక సచివాలయం నుంచి వైఎస్సార్ కూడలి వరకూ పవన్‌కళ్యాణ్ డౌన్‌డౌన్ అంటూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్ఐ మల్లికార్జునరెడ్డి, స్పందన కార్యక్రమంలో తహసీల్దార్ హమీద్‌బాషాకు వినతి పత్రం అందించారు. పలువరు వలంటీర్లు మాట్లాడుతూ వలంటీర్ల మనోభావాలను దెబ్బ తీసేవిధంగా ప్రచారం చేస్తున్న పవన్‌కళ్యాణ్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. భవిష్యత్తులో ఆయన ఎక్కడ తిరిగినా వలంటీర్లు అందరూ సమైక్యంగా అడ్డుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఫయాజ్‌అలీ, గజ్జలరవీంద్రారెడ్డి,ఆర్బీకే చైర్మన్ శంకర్‌నాయుడు, సొసైటీ చైర్మన్ ఎస్పీహైదర్ వలీ నాయకులు ఇక్బాల్, సికిందర్, మేకల నరసింహులు, ఫారుక్, మండలంలోని 7 గ్రామ సచివాలయాల వలంటీర్లు పాల్గొన్నారు.

ఇంటింటా సర్వేపై సమావేశం

నల్లమాడ: ప్రత్యేక ఫొటో ఓటర్ల జాబితా తయారీలో భాగంగా ఈనెల 21 నుంచి నెల పాటు ఇంటింటా సర్వే నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎస్. దేవేంద్రనాయక్ తెలిపారు. సోమవారం తమ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. అనర్హుల తొలగింపు, సవరణ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివరించారు. సమావేశంలో డీటీ కేఎస్ మల్లికార్జున, ఎంపీపీ దుంగావత్ సునీతాబాయి, వైఎస్సార్ సీపీ కన్వీనర్ కుళ్లాయినాయక్, నాయకులు కొక్కంటి సాంబశివారెడ్డి, తదితరులున్నారు.

జాబితా సరిచేసుకోండి

అమడగూరు: నెలాఖరులోపు ఓటరు జాబితా సరి చేసుకోవాలని తహసీల్దార్ వెంకటరెడ్డి పేర్కొన్నారు. సోమవారం అఖిలపక్ష పార్టీ సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఐ ఈశ్వరయ్య, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కదిరిలో..

కదిరి అర్బన్: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం రాజకీయ పార్టీలతో ఎన్నికల నమోదు అధికారి, ఆర్డీఓ రాఘవేంద్ర సమావేశం నిర్వహించారు. సర్వేకు సంబంధించి రాజకీయ పార్టీల నాయకులతో చర్చించారు. తహసీల్దార్ నటరాజ్, డీటీ ముకుందా తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల సర్వేకు సహకరించండి

కనగానపల్లి: ఓటర్ల సర్వేకు సహకరించాలని తహసీల్దార్ రమాదేవి సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆమె పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. అమరనాథరెడ్డి, నాగముని, నెట్టం వెంకటేష్, పోతలయ్య, ముత్యాలు తదితరులున్నారు.

చౌడేశ్వరీ దేవి శరణు..!

నియోజకవర్గ వ్యాప్తంగా చౌడేశ్వరీదేవి ఆలయాలలో సోమవారం అమ్మవారి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారికి మహిళలు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



సీకే పల్లిలో అలంకరణలో మహేశ్వరి దేవి



ఎన్పీ కుంటలో అమ్మవారికి బోనాలు తీసుకెళ్తున్న మహిళలు



ధర్మవరం: ఆలయంలో అన్నదానం చేస్తున్న దృశ్యం

పల్లె దారి.. సుందరంగా మారి..



వంకమద్ది నుంచి పెదరాంపల్లి వరకు వేసినతారురోడ్డు

ఎన్పీకుంట: మండలంలోని వంకమద్ది, గురికానివారిపల్లి, పెదరాంపల్లి, సోమరాజుకుంట, పులగూరవాండ్లపల్లి, తాటిమానుగుంత గ్రామస్తుల కల నెరవేరింది. గ్రామాలు ఏర్పడి దశాబ్దాలు గడిచినా సరైన రహదారి సౌకర్యం లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. చినుకు పడితే అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి. రాళ్లు తేలి గతుకులు, గుంతలు పడ్డ రోడ్లపై ప్రయాణం భారంగా మారేది. ద్విచక్ర వాహనాలతో సైతం ప్రయాణం చేయాలన్నా చాలా కష్టంగా ఉండేది. 108, 104 వాహనం కూడా వెళ్లలేని పరిస్థితి. 2019 ఎన్నికల ప్రచారంలో భాగంగా డాక్టర్ పీవీ సిద్దారెడ్డికి గ్రామస్తులు తమ గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు కదిరి–రాయచోటి ఆర్కె రోడ్డు నుంచి పెదరాంపల్లి వరకు రూ.2.92 కోట్ల నిధులతో 5.78 కి.మీ, అలాగే ధనియానిచెరువు పంచాయతీ సోమరాజుకుంట మీదుగా పులగూరవాండ్లపల్లి, తాటిమానుగుంత గ్రామాలకు రూ.3.36 కోట్ల ఏపీఆర్ఆర్‌పీ నిధులతో 5.50 కిమీ తారురోడ్లు వేయించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు సౌకర్యం కలే అనుకున్నాం



గతంలో చాలా మంది నాయకులు మా గ్రామానికి వచ్చి రోడ్డు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చి ఓట్లు వేయించుకున్న వారే తప్ప, హామీలు నెరవేర్చిన నాయకులు లేరు. మా గ్రామాలకు రోడ్డు సౌకర్యం 'కలే' అనుకున్నాం. ఎమ్మెల్యే సిద్దారెడ్డి, ఎంపీపీ ఈటెరాము ఆ కల నిజం చేశారు.

– ఎన్.రవీంద్ర, గురికానివారిపల్లి

హామీ నెరవేర్చారు



ఎంతో మంది నాయకులు మాట ఇచ్చి తప్పారు. దీంతో మండల కేంద్రానికి వెళ్లాలంటే చుట్టూ తిరిగి వెళ్లాల్సి వచ్చేది. చాలా ఇబ్బందిగా ఉండేది. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇచ్చిన హామీ మేరకు రోడ్డు వేసి మా ఇబ్బందిని తొలగించారు. సీఎం జగన్‌కు కృతజ్ఞతలు.

– చిన్ననరసయ్య, తాటిమానుగుంత

పేదల కోసమే 'జగనన్న సురక్ష'



ధ్రువపత్రాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

తనకల్లు: పేదల కోసమే జగనన్న సురక్ష పథకానికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి అన్నారు. మండల పరిధిలోని బొంతలపల్లి సచివాలయంలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంటి వద్దకే ఉచితంగా ధ్రువపత్రాలు అందజేస్తారని పేర్కొన్నారు. అనంతరం 1,214 మందికి పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీఓ పూల నరసింహులు, తహసీల్దార్ శోభ సువర్ణమ్మ, ఈఓఆర్డీ ఆనందయ్య, నాయకులు శ్రీనివాసులనాయుడు, సుకుమార్‌రెడ్డి, నీలకంఠారెడ్డి, సమర సింహారెడ్డి, బాల్‌రెడ్డి రమణ తదితరులున్నారు.

పలు గ్రామాల్లో..

బత్తలపల్లి: జగనన్న సురక్ష పథకం వలంటీర్ల పనితీరుకు అద్దం పడుతోందని పలువురు అన్నారు. సోమవారం దంపెట్ల, గరిశలపల్లి గ్రామ పంచాయతీల్లో సర్పంచులు చల్లా కరుణాకర్‌నాయుడు, పద్మావతి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీపీ బగ్గిరి త్రివేణి, వైస్ ఎంపీపీ గజ్జల వెంగళరెడ్డి, ఎంపీడీఓ సౌజన్యకుమారి, సీఎస్‌డీటీ శారద, ఈఓఆర్డీ దివాకర్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, సచివాలయాల కన్వీనర్ జయరామిరెడ్డి తదితరులు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ వలంటీర్లను పవన్‌కళ్యాణ్ దేశద్రోహులుగా చిత్రీకరిస్తూ మాట్లాడడం సరికాదన్నారు. బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం 1,421 రకాల ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నాగిరెడ్డి, చెన్నారెడ్డి, ఆంజనేయులు, వెంకట తదితరులున్నారు.

అమీన్ నగర్‌లో చోరీ

కదిరి టౌన్: కదిరి మున్సిపాలిటీ పరిధిలోని అమీన్‌నగర్‌లో నివసిస్తున్న వస్త్ర వ్యాపారి బాబ్జాన్ ఇంట్లో సోమవారం చోరీ జరిగింది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వస్త్ర వ్యాపారి బాబ్జాన్ భార్య డెలివరీ కోసం వలీసాబ్ రోడ్డులో ఉన్న పుట్టింటికి వెళ్లింది. ఆమెను చూడటానికి ఆదివారం ఇంటికి తాళం వేసుకుని బాబ్జాన్ వెళ్లాడు. సోమవారం ఉదయం ఇంటికి రాగా, తాళం పగులగొట్టిన స్థితిలో కనిపించింది. లోపల బీరువా కూడా తెరచి ఉంది. అందులోని 5 గ్రాములు బంగారం, రూ. 30 వేలు కనిపించలేదు. వెంటనే పట్టణ పోలీస్‌స్టేషన్లో బాధితుడు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ మగ్బూల్ బాషా సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

అలరించిన సంగీత కచేరీ



సంగీత కచేరీ నిర్వహిస్తున్న భక్తులు

ప్రశాంతి నిలయం: సత్యసాయి నామామృతంతో ప్రశాంతి నిలయం పులకించింది. పర్తియాత్ర ముగింపు సందర్భంగా విజయనగరం జిల్లా భక్తులు సోమవారం సాయంత్రం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత సంగీత కచేరీ నిర్వహించారు. సత్యసాయిని కీర్తిస్తూ సుమారు గంట పాటు వారు నిర్వహించిన కచేరీతో భక్తులు మైమరచిపోయారు.

మహిళా రైతు ఆత్మహత్య

కనగానపల్లి: పాతపాళ్యం గ్రామంలో మహిళా రైతు జీ శ్రావణి (32) పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన జీ సుధీర్‌రెడ్డి, అతని భార్య శ్రావణి వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వ్యవసాయం కోసం మూడు బోర్లు తవ్వారు. బయట వ్యక్తుల వద్ద రూ.8 లక్షల దాకా అప్పు చేశారు. పంట సాగు కోసం రూ. 2 లక్షలు అప్పు చేశారు. అప్పు తీర్చేమార్గంలేక శ్రావణి ఆదివారం ఇంట్లో పురుగు మందు తాగింది. కుటుంబ సభ్యులు అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. సోమవారం మృతి చెందింది.మృతదేహాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి, అమరనాథరెడ్డి, నాగముని, అశోక్ నివాళులు సందర్శించి, నివాళులర్పించారు.

జనవిజ్ఞాన వేదికలో భాగస్వాములు కావాలి

అమడగూరు: సైన్స్ ఫలాలు పొందడానికి జనవిజ్ఞాన వేదికలో భాగస్వాములు కావాలని జేవీవీ జిల్లా కార్యదర్శి గౌస్‌లాజమ్ పేర్కొన్నారు. సోమవారం ఓడీ చెరువు మండలం కొండకమర్లలో పోస్టర్లను విడుదల చేశారు. హెచ్ఎం మునేనాయక్, షబీనా, సోమశేఖర్, తదితరులున్నారు.

వక్ఫ్ బోర్డు ద్వారా అభివృద్ధి పనులు

తాడిమర్రి: వక్ఫ్‌బోర్డు ద్వారా ముస్లిం సోదరుల సౌకర్యం కోసం అభివృద్ధి పనులు చేపడుతామని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు కమిటీ సభ్యులు జాకీర్, షఫీవలి పేర్కొన్నారు. స్థానిక జామియా మసీదులో సోమవారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో షబ్బీర్, బాబావలి తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ధరకే సన్న బియ్యం పంపిణీ

ధర్మవరం అర్బన్: మార్కెట్ కన్నా తక్కువ ధరకే సన్న బియ్యం, కందిబేడలను పంపిణీ చేస్తున్నామని ఆర్డీఓ తిప్పేనాయక్ తెలిపారు. పట్టణంలోని పాండురంగస్వామి ఆలయంలో సోమవారం కౌంటర్‌ను ఆర్డీఓ ప్రారంభించారు. మార్కెట్‌ధర కన్నా రూ.10 తక్కువగా ఇస్తున్నామని తెలిపారు. తహసీల్దార్ యుగేశ్వరిదేవి, సీఎస్‌డీటీ లక్ష్మిదేవి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీల్లో సత్తా

ధర్మవరం: రాష్ట్రస్థాయి త్రోబాల్ సబ్ జూనియర్స్ పోటీలలో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు యశోద పాఠశాల డైరెక్టర్ పృధ్విరాజ్ తెలిపారు. హేమశ్రీ, నాగసాయి మిథిల,కార్తీక్‌నాయక్‌లు ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపల్ అనూప్, ఉపాధ్యాయులు అశోక్, మణికంఠ, జ్యోతి, ప్రసన్న అభినందించారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయించండి

కనగానపల్లి: ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయించాలని ఎంపీడీఓ అలివేలమ్మ ఆదేశించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆమె సమావేశం నిర్వహించారు. హౌసింగ్ ఏఈ చిరంజీ తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణలు అరికట్టండి

కనగానపల్లి: దాదులూరు సమీపంలో జాతీయ రహదారి పక్కన ప్రభుత్వ భూముల ఆక్రమణను అరికట్టాలని రైతు సంఘం నాయకుడు కదిరప్ప రెవెన్యూ అధికారులను కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రమాదేవికి ఫిర్యాదు చేశారు.

ఆర్ఎంపీల నూతన కార్యవర్గం ఎన్నిక

కదిరి టౌన్: కదిరి తాలూకా ఆర్ఎంపీ డాక్టర్ల నూతన కార్యవర్గం ఎన్నిక సైదాపురం ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం నిర్వహించారు. అధ్యక్షుడిగా అల్లాబకాష్, ఉపాధ్యక్షుడిగా ఓబులేసు, సెక్రటరీగా ఎస్.బాబ్‌జాన్,కోశాధికారిగా ఎస్.మహబూబ్ బాషా, తనకల్లు సెక్రటరీగా ఇమాంసాబ్, జాయింట్ సెక్రటరీగా గూనిపల్లి ఈశ్వరయ్య, గౌరవ సలహాదారులుగా ఆంజనేయులు, నాగన్న ఎన్నికయ్యారు. ఈసీ మెంబర్లుగా 9 మందిని ఎన్నుకున్నారు.

కర్ణాటక మద్యం ధ్వంసం



మద్యాన్ని ధ్వంసం చేస్తున్న పోలీసులు

తనకల్లు: అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన కర్ణాటక మద్యాన్ని పోలీసులు ధ్వంసం చేశారు. సోమవారం స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డ్ వద్ద ఎస్ఐ రాంభూపాల్ ఆధ్వర్యంలో 24 అక్రమ మద్యం కేసుల్లో పట్టుబడిన 970.14 లీటర్ల కర్ణాటక మద్యాన్ని ట్రాక్టర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. ధ్వంసం చేసిన అక్రమ మద్యం విలువ దాదాపు రూ. 3.39 లక్షలు ఉంటుందని ఎస్ఐ తెలిపారు. కార్యక్రమంలో పలువురు సెబ్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

చోరీ వస్తువుల అప్పగింత

ధర్మవరం అర్బన్: ప్రభుత్వ పాఠశాలలో చోరీకి గురైన కంప్యూటర్, ప్రొజెక్టర్, బ్యాటరీలను పాఠశాల హెచ్ఎంకు అప్పగించినట్లు వన్‌టౌన్ సీఐ సుబ్రమణ్యం తెలిపారు. పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం సీఐ సుబ్రమణ్యం లోనికోట ఉర్దూ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వహీదకు చోరీకి గురైన వాటిని అప్పగించారు. కోర్టు ఉత్తర్వుల మేరకు హెచ్ఎంకు అప్పగించామని సీఐ తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

బత్తలపల్లి: బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సీఎస్‌డీటీ శారద తెలిపిన మేరకు.. ముందస్తు సమాచారంతో విజిలెన్స్ సీఐ సాయిప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం బత్తలపల్లి మండలం సంగాల గ్రామంలో ఆటోలో లోడ్ చేసిన 13.68 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని సీజ్ చేసి సంగాలకు చెందిన శివకుమార్‌పై కేసు నమోదు చేశారు.